# కట్టడి

బావిని కట్టడి చేశారు.

ఎవరూ నీళ్ళు తెచ్చుకోవటం లేదు.

పొద్దున్నే నీళ్ళు లేకపోతే, పొయ్యి ముట్టించకపోతే రోజు మొదలుకాదు.

అయినా బావి దగ్గరకు ఎవరూ పోవటం లేదు.

పెద్దోడికి పదేళ్ళు కూడా లేవు. కట్టడి అంటే ఏమిటని కుతూహలం? వాడికదో పెద్ద ప్రశ్న!

బావులెండి, బోర్లు ఎండి, కృష్ణ నీళ్ళో, గోదావరి నీళ్ళో పల్లెలకు, పట్టణాలకు మళ్లించమంటున్న ఈ రోజుల్లో కట్టడి ఏమిటో తెలియకపోవచ్చుగానీ, దేశానికి స్వాతంత్ర్యం రాబోతున్న ఆ రోజుల్లో కట్టడి గూర్చి పెద్దోడికి తెలిసి తీరాలి.

అటూ ఇటూ పరుగెత్తి వాళ్ళనూ వీళ్ళనూ అడిగాడు. బావిని చూడబోతుంటే వాళ్ళమ్మ వాణ్ణి రెక్క పట్టుకొని గుంజి 'యాడకి లగెత్తుతున్నా' అని కసిరింది.

అసలే ఎండాకాలం. నీటి ఎద్దడి. పైగా కట్టడి. గుంటూరు పక్కనున్న మెట్టగ్రామం వేజండ్లలో కొండవీటి చాంతాళ్ళు అక్కరలేదు కానీ, నీళ్ళు మాత్రం బాగా అడుగంటాయి. పొద్దున్నే కొంచెం ఊరి ఉంటాయి. ముందుగా లేచిన వాళ్ళు నాలుగు కడవలు తెచ్చుకోగలరు. ఆ వీలు కూడా లేకుండా పోయిందీ రోజు.

బావి గిలకలకు, బద్దెలకు వెంట్రుకలు చుడితే గిలకలు తిరగవు. వెంట్రుకలు తెంచగలిగిన వాళ్ళు లేరు. చుట్టిన వాళ్ళే వెంట్రుకలు విడదీయాలి. అప్పుడే నీళ్ళు తోడడం సాధ్యం!

మాదిగ పల్లెకు అదొక్కటే మంచినీళ్ళు బావి. బొందల్లో బావి పాడుబడింది. నీళ్ళు లేవు. కాటి బావి ఎండిపోయింది. చెరువుల, కోనేళ్ళ నీళ్ళు మాదిగ వాళ్ళను తెచ్చుకోనీయరు. అవీ ఎండిపోయాయి. ఇదొక్కటే బావి. దీనికీ కట్టడి!

ఏం చేయాలో తెలియక పల్లె గుబ్బుట్లాడుతూ ఉంది. ఎవరూ నీళ్ళు తోడలేదు.

అది మొండోడి పని. పెద్ద మాదిగకు తెలుసు. వాడు కనిపించడు. వాణ్ణి చూడటం అపశకునంగా భావిస్తారు మాదిగలు. వాడు రాత్రిపూట వస్తాడు. 'మొండోణ్ణి బువ్వ బెట్టు తల్లీ' అని కేక పెడతాడు. ఆ కేక మూడుసార్లే! ఆ పైన అడగడు. కేక విన్నవాళ్ళు వినిపించిన దిక్కుగాపోయి ఎత్తుగా ఉన్నచోట బువ్వగిన్నె పెట్టి రావాలి. వాడు చీకట్లో ఎప్పుడో వచ్చి తిని వెళ్ళిపోతాడు. కుక్కల్ని రాకుండా చూసుకోవటం అతడి పనే! తెల్లవారాక పాత్ర తెచ్చుకోవాలి. ఆ గిన్నె మల్ల, కుండ, ముంత, మూకుడు ఏదైనా వాళ్ళు వారం రోజులు వాడరు.

మాదిగలు చద్దినీళ్ళతో వంట చేయరు. వంట చేయాలంటే నీళ్ళు తోడి తేవాలి. నీళ్ళు లేకపోతే పని మొదలుకాదు. పొయ్యి ముట్టించరు. పొగరాదు. ఏ రోజైనా ఆ పాటికి అన్ని ఇళ్ళల్లోంచి పొగలేచేది. పల్లె ఆ పొగను కప్పుకొనేది. ఆ రోజు మాదిగపల్లె ధూపం వేయని దేవుడి గుడిలాగా ఉంది. గిలక మోగితేనే గుళ్ళో గంటకొట్టినట్టు. నీళ్ళు తెస్తేనే తీర్థప్రసాదాలు పంచినట్టు. ఆ రోజింకా పూజ జరగలేదు.

మొండోడు మాదిగ ఉపకులం వాడే. మాదిగల దగ్గరనే యాచిస్తాడు. మరెవరినీ యాచించడు. మాదిగల దగ్గర అడుక్కునే పది ఉపకులాల్లో మొండోడు చివరి కులంవాడు. వీడికి పెట్టేవాడూ కనిపించడు. వాళ్ళకు పెట్టించుకునే వీడూ కనిపించడు. గుప్తదానం, గుప్త స్వీకారం.

మొండోడు పగటిపూట రాడు. ఎవరినీ చూడడు. ఎవరికీ కనబడడు. ఒక్క ఇంటినే అడుగుతాడు. వాళ్ళు ఏం పెట్టినా, ఎంత పెట్టినా తింటాడు. ఇక ఆ ఊళ్ళో ఉండడు. మరో మాదిగ పల్లెకు వెళ్ళిపోతాడు. పొలాల్లో, కాలవ గట్లమీద, చెరువు ఒడ్డున, ఎక్కడో నిద్రపోతాడు. పల్లెలో పడుకోడు. అడిగిన ఇంటివాళ్లు అర్ధరాత్రి లోగా అన్నం పెట్టకపోతే, వరసగా మూడు రోజులు భిక్ష దొరక్కపోతే, మూడోరోజు రాత్రి పక్కగ్రామం వెళ్ళి, తెల్లవారు జామున బావి కట్టడి చేస్తాడు. వాడి ఏకభుక్తం తీరకపోతేనే కట్టడి!

వాడికి పెళ్ళాం ఉండదు. పిల్లలుండరు. ఇల్లుండదు. ఊరుండదు. దేశదిమ్మిరి. ఎక్కడో మొండిది ఎదురవుతుంది. కలుస్తారు. నెల తప్పుతుంది. పిల్లల్ని కంటుంది. వాళ్ళని పదేళ్ళకు వదిలేస్తుంది. ఉపకులం అంతరించి పోకుండా నిలుస్తుంది.

కట్టడి చేసినప్పుడు, దానికి విడుదల కావాలంటే మొండోడికి అన్నం పెట్టాలి. తిన్నంత పెట్టాలి. మిగిల్చేంత పెట్టాలి.

పెద్ద మాదిగ మార్గం చెప్పాడు. చద్ది అన్నం ఉంటే పెట్టవచ్చు.

ఎంత ఉంటుంది? ఎంత ఉంటే అంత! వాడి కడుపు నిండాలంటే, అన్ని ఇళ్ళ వాళ్ళూ సిద్ధం కావాలి.

మాదిగలు అసలే పేదలు. ఏ పూటకాపూట గడిస్తే గగనం. తినగా మిగలటం వింతే! పనులుంటే పస్తులుండవు. కాని ఎండాకాలం పనులుండవు. అందరూ రైతు కూలీలే! రాత్రే కుండలు కడిగి బోర్లిస్తారు.

పిల్లోళ్ళున్న ఇళ్ళల్లో, ముసిలోళ్ళకూ, పిల్లలకూ రాత్రి వండిన కుండల్లో నీళ్ళు పోసి, ఉప్పు వేసి ఉంచుతారు. తెల్లారేసరికి పుల్నీళ్ళు ఉంటాయి. పొద్దున్నే తాగుతారు.

ఎవరైనా అన్నంమీద అలిగితే పొద్దుట చద్ది ఉండవచ్చు. తిండి యావకంటే వేరే యావ ఉన్న మొగుడూ పెళ్ళాలున్న ఇళ్ళలో చద్ది ఉండవచ్చు.

రాత్రి సోవక్కని నల్లోడు తన్నాడు. అది అలిగి పడుకుంది. అన్నం అడగటం నామోషీ అయి వాడూ పడుకున్నాడు. వాళ్ళింట్లో చద్ది అన్నం ఉంది. అది నిన్న పొద్దుటిది. పాచిపోయింది. నిన్న పొద్దుటి పప్పు పులిసి బుర్రట్లాడుతూ ఉంది. రెండు కలిపి దుత్తలో పోసింది. నల్లోడు దుత్త తీసుకెళ్ళి బావిగట్టుమీద పెట్టి వచ్చాడు. రాగానే 'నువ్ బొవ్ అంతగత్తెవే గాడిదా' అన్నాడు.

'పోరా తాగుబోతోడా!' అంది.

వాడు సోవక్కను వాటేసుకున్నాడు. అలగటం మాయం.

పిడచడు చద్ది అన్నం, చింత చిగురు పచ్చడి వేసి కాటికి కాళ్ళు చాపిన ముసిలిదానికి పెట్టబోయే దాన్ని కొత్త కోడలు తీసుకుపోయి బావి గట్టుమీద ఉంచింది. అవ్వ నోట అంత గాలి నిండింది. చెంబునిండా నీళ్ళు తెచ్చి అవ్వకు తాగించింది కోడలు. చేతికర్రతో కుక్కల్ని తరుముతూ వేపచెట్టు కింద కుక్కిమంచంలో పడుకొంది అవ్వ.

రాత్రి దాచి ఉంచిన అన్నం కుండలోని పుల్నీళ్ళు, కుండ అడుగు చిల్ల పెంకుతో గీకి, కలదిప్పి రెండు గిన్నెల్లో పోసి, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయ తీసి ఇద్దరు పసివాళ్ళకూ ఇవ్వ బోతుండగా, ఇంటాయన వచ్చి, గిన్నెల్లో పుల్నీళ్ళు కుండలో పోసి, బావి కాడికి తీసుకుపోయాడు. పిల్లలు ఏడుపు లంకించుకున్నారు. గాడిద కూస్తే గాని ఏడుపు మానరని వాళ్ళకు ప్రసిద్ధి. ఏడవ వద్దంటే వినలేదు. నాలుగుతికితే రాగం పెంచారు. వీపులు వాయించింది తల్లి. కొంపలంటు కున్నట్టు ఏడుపు. ఫైరింజన్‌లాగా ఆమె మోతలు మోగించింది.

పెద్దోడి కంచంలోని పెరుగన్నాన్ని 'ఇవ్వరా' అంది తల్లి.

'ఇవ్వ'నన్నాడు వాడు.

'మొండోడికి పెట్టా'లంది.

'ఎందుకు పెట్టాలి' అని అడిగాడు.

'వాడికి తిండి లేదు'

'నాకు కావద్దా?'

'నీకు వండి పెడతా?'

'వాడికి వండి పెట్టరా?'

'పెట్టరు!'

'వాడెట్టా బతుకుతాడు?'

'మనం పెడితే!'

'మనమే పెట్టాలా?'

'మనమే పెట్టాలి'

'మనమే ఎందుకు పెట్టాలి?'

'మనకాడే వాడు అడుక్కొనేది?'

'మనకాడే ఎందుకు?'

'మనమే వాడికి పెట్టాలి'

'మనమే ఎందుకు?'

'వాడు మన పనోడు'

'మనకే పనులు లేవు కదా?'

'లేకపోయినా పెట్టాలి'

'మన నోటికాడి కూడు పెట్టాలా?'

'పెట్టాలి'

'అది రూలా?'

'రూలే!'

'అయితే పెట్టు'. కంచం తల్లి చేతికిచ్చాడు పెద్దోడు. అయినా వాడికి రూలు అర్థం కాలేదు. అందుకే మొండోణ్ణి చూడాలని బయలుదేరాడు. చూడరాదు అంటుంది తల్లి. చూస్తే కీడు అంటుంది. 'కీడు లేదు. పాడు లేదు. చూడాల్సిందే!' ఉట్టిమీద పెరుగు సట్టితీసి తల్లికిచ్చాడు. పెద్దోణ్ణి తల్లి ముద్దు పెట్టుకుంది. పెద్దోడు దబరా తీసుకెళ్ళి బావి గట్టుమీద పెట్టాడు.

కనీసం పది ఇళ్ళనుంచి ఏదో ఒకటి బావి గట్టుమీదకు చేరింది, గిన్నెలు, దబరాలు, మల్లలు, కుండలు, మూకుళ్ళు, ముంతలు, పిడతలు, సట్టులు బావి గట్టుమీదకు చేరాయి. పిల్లలు, ముసిలోళ్ళు, అవిటోళ్ళు, ఆకలోళ్ళు అందరూ ఆ పూట పస్తే!

మొండోడు ఏ ఊళ్లో పొద్దున్నే కడుపునిండా కూడు తింటాడో ఆ ఊరికి ఏ కీడూ మూడదంటారు. అంట్లాంటివాణ్ణి చూస్తే మాత్రం ఏం నష్టం? పెద్దోడు గడప దాటాడు. ఎవరికి కనిపించినా బయటికి పోనివ్వరు. ఎవరు చూసినా మొండోడు ఆ పాత్రలు అంటుకోడు. అందువల్ల పల్లె వాళ్ళకు కానీ, మొండోడికి కానీ కనిపించకుండా వాణ్ణి చూడాలి. పెద్దోడు దొంగలాగా నక్కినక్కిపోసాగాడు. ఇంకా కపెర కపెర చీకటి ముసురుకునే ఉంది.

అందరూ పోయి ఇళ్ళ తలుపులు, కిటికీలు మూసుకుని అరగంట దాకా బయటికి రాకుండా ఉండండని పెద్ద మాదిగ హెచ్చరించాడు. తలుపులు మూసుకుపోయాయి. కుక్కల్ని రాకుండా చూడటం పెద్దమాదిగ పని.

బావికాడ మనుషుల్లేరు. అలికిడి లేదు. ఇక ఎప్పుడైనా మొండోడు రావచ్చు. పెద్దోడు చూస్తున్నాడు.

వేజండ్లలో మాదిగ పల్లె నానుకుని రైలుకట్ట ఉంది. పక్కనే రైలుస్టేషన్ ఉంది. ఆ ఊళ్ళో వర్జీనియా పొగాకు పండిస్తున్నప్పుడే బేరన్లు వెలిశాయి. వాటికి బొగ్గు సరివి కట్టెలు దిగుమతి

అవుతూ వచ్చాయి. వాగెన్లలో నుంచి దించిన రాక్షసి బొగ్గు, సరివి కట్టెలు అప్పటికప్పుడు ఎడ్లబండ్లమీద బేరన్లకు తోలేవాళ్ళు కాదు. నిలవ ఉండే బొగ్గును లాటులు కట్టేవాళ్ళు. లాటుకీ లాటుకీ మధ్య మనిషి రానూ పోనూ సందు ఉండేది. రాక్షసి బొగ్గు లాటులు బావికి దగ్గరగా ఉన్నాయి.

ఒక బొగ్గులాటు వెనక పెద్దోడు బావికి దూరంగా బావిని చూస్తూ నక్కి నిలబడ్డాడు. పెద్దోడు కాటికాపోడులాగా, మొండోడులాగా, బండోడులాగా, బొగ్గు దించిన కూలీలాగా నల్లగా నిగనిగలాడుతూ ఉన్నాడు.

ఏ క్షణంలోనైనా బండోడిలాంటి మొండోడు బయటికి రావచ్చు.

బువ్వ వాసన మూచ్చూస్తూ ఒక కుక్క బావివైపు రాసాగింది.

మొండోడి కూడు కుక్క పాలవుతుందని పెద్దోడు అయ్యో అనుకున్నాడు. 'చెయ్' అని అరిచి దాన్ని తోలబోయాడు. కాని తాను అరవగూడదు, బయటికి రాకూడదు. మనిషి అలికిడి అయితే మొండోడు రాడు. రాకపోతే అరిష్టం. పెద్దోడు కుక్కిన పేనులాగా కూర్చున్నాడు. కిక్కురుమనలేదు.

అంతలో ఎక్కణ్ణుంచి పడిందో పెద్ద రాక్షసి బొగ్గు బండ ఒకటి కుక్క నడ్డిమీద పడింది. అది కూలబడింది. కుయ్‌మంది. నిలబడింది. కయ్‌మంది. పరుగు లంకించుకుంది. అరిస్తే ఒట్టు, ఆగితే ఒట్టు.

పెద్దోడికి సంతోషం కలిగింది. తన నోటికాడి కూడు మొండోడు రక్షించుకున్నాడు. వాడు నమ్మకంగా బొగ్గులాటుల్లోనే ఉన్నాడు.

అయినా మొండోడు బావి దగ్గరకు రాలేదు.

ఇదేం అడుక్కునే పద్ధతి? ఏమిటి వీడి రాజరికం? ఇదేం దర్జా? మాదిగలు అంత భయభక్తులతో వాడికి అన్నం పెట్టటమేమిటి? వీళ్ళే లేని వాళ్ళు. వీళ్ళ పిల్లలు ముసలివాళ్ళ నోళ్ళు కట్టి, దర్పంగా అడుక్కునే మొండోడికి వినయ విధేయతలతో కలోగంజో తెచ్చి పెట్టటమేమిటి? వాడి హక్కు అర్థం కావటంలేదు.

మహారాజుకు సామంతరాజులు కప్పం కట్టినట్టు శ్రద్ధగా ఈ సమర్పించుకోవటం ఏమిటి?

కూటికోసం కోటివిద్యలు సరే, అడుక్కునే వాడికి అరవై ఆరూళ్ళూ నిజమే.

మొండోడు మాదిగ పల్లెల్లోనే అడుక్కోవటం ఏమిటి.

అడుక్కోవటం కొందరికి హక్కుగా మనువు ఇచ్చినట్లుంది. మనువు పుట్టకముందు నుంచి ఉన్న సంప్రదాయానికి మొండోడు కొనసాగింపు లాగా కనబడటం విచిత్రంగానే ఉంది.

దేనికిది ప్రత్యామ్నాయం?

దేనికిది పర్యవసానం?

దేనికిది పరిష్కారం?

వాడు బిచ్చం అడగటం – వీళ్ళు తిట్టటం, కొట్టటం, తరమటం, కుక్కల్ని ఉసిగొలపటం, వాడు తిరిగి తిట్టటం, శపించటం, తిరగబడటం, దొంగిలించటం, దోపిడీలు చేయటం, జేబులు కత్తిరించటం, ఇళ్ళకు కన్నాలు వేయటం, పంట కోసుకుపోవటం, నిలబెట్టి జేబులో డబ్బు లాక్కుపోవటం, రేపటికింత డబ్బు తెచ్చి ఇమ్మనటం, లేకపోతే ఇళ్ళు తగులబెట్టటం, చంపటం, బేంకు దొంగతనాలు, కంప్యూటర్ దొంగతనం, హైటెక్ దొంగతనం – తనది కానిది, తనకు కావలసింది, శ్రమించకుండా, సంపాదించటం ఏం న్యాయం? ఏం ధర్మం?

ఓటు అడుక్కోవటం, ఉద్యోగం అడుక్కోవటం, అధికారం అడుక్కోవటం, బిచ్చం పెట్టే మనుషులు, దేశాలు, అంతర్జాతీయ యాచన, దోపిడీ, లంచాలు, స్కాములు, స్వాములు, దేవుళ్ళు – ఇంత యాచన ఉన్న లోకంలో ఇదేం యాచన? ఇదేం భిక్ష?

ఇది ఏ సంస్కృతి పరాజయం? లేకపోతే దేని పరాకాష్ట? పెద్దోడి చిన్న బుర్రలో లెక్కలేనన్ని చిక్కుముళ్ళు.

పెద్దోడు నిక్కి నిక్కి చూస్తున్నప్పుడు బొగ్గు లాటులు కదిలినట్లయింది. నడచినట్లయింది. మానవ మాత్రుడు వెలుపలికి వచ్చాడు. బావివైపు నడుస్తున్నాడు.

మొండోడు రాక్షసి బొగ్గుగుట్ట లాగుతున్నాడు. అంతా నలుపు. జుట్టు, శరీరం, నిక్కరు కారు నలుపు, తారు నలుపు, నల్ల రాకాసి బొగ్గు నలుపు.

అట్టలు కట్టుకుపోయిన జుట్టు చివర ఎక్కడో, శరీరం ఎక్కడో తెలియకుండా, అఖండంగా నల్లగా ఉన్నాడు. వాడి నిక్కరు గోచికంటే పెద్దది. మనిషికి బొగ్గురంగు నూత్న సౌందర్యం కలిగించింది. నల్లమట్టి, ఎర్రమట్టి, డొంకమట్టి, ఇసుక, బొగ్గు నుసిమసి కలగలసిన కాళ్ళు కదలి బావివైపు వచ్చాయి. చెప్పుల్లేవు. కాని నడక దర్జాగా వుంది. ఠీవిగా ఉంది. పౌరాణిక సినిమాల్లో రాజు నడకలాగా ఉంది. హుందాగా వుంది. సామంతరాజులు అక్కడ కప్పం పెడితే వచ్చి చూచిపోయే రాజు నడకలాగా ఉంది మొండోడి రాక. సర్వసంగపరిత్యాగి అయిన సన్యాసిలాగా, అన్నీ తెలిసిన మహర్షిలాగా, సర్వసమస్యల్ని పరిష్కరించే పురుషోత్తముడులాగా వచ్చాడు.

నంగి నడక లేదు. వంగి నడకలేదు. దొంగ నడకలేదు. తాను నడచినంత మేర ఈ భూమి అంతా నాదేనన్న చక్రవర్తి డాబు, దర్పం, దర్జా చూపుతున్నట్టు వచ్చాడు.

ఇది ముందు, ఇది వెనుక అని చూడలేదు. ఇది కావాలి. ఇది వద్దు అనుకోలేదు. అన్నమంతా పరబ్రహ్మ స్వరూపమే. పాచిపోయినా ఫరవాలేదు. చద్ది అయినా చింతలేదు. పుల్నీళ్ళు అయినా మేలే! ఒక్కొక్కటీ తీసుకున్నాడు. తాగేదయితే తాగాడు. తినేదయితే తిన్నాడు.

ఎందులోనూ చేయి పెట్టలేదు. కలపలేదు. ముద్దలు చేయలేదు. ఒక్కొక్కటీ తీసుకుని నోట్లోకి వంచుకున్నాడు. అన్నమయితే ఆగాగి తిన్నాడు. పుల్నీళ్ళు ఆగాగి తాగాడు. పచ్చిమిరప కాయ నోట్లో పడితే నమిలి మింగాడు. ఉల్లిపాయ పడితే కొరికి తిన్నాడు. మజ్జిగ అయితే

తాగాడు. ఏ ముంతా మూకుడు నోటికి తగల్లేదు. తిని, తాగిన తర్వాత నోటిలో నుంచి ఏమీ బైటికి ఉమ్మి వేయలేదు.

పాత్రలకుండే మురికి అతడికి అంటలేదు. వాడి ముఖానికున్న మసి నోట్లోకి పోలేదు. వాడు నోరు కడుక్కోలేదు. చేయి కడుక్కోలేదు. పెదాలకేమీ అతుక్కోలేదు. పాత్రలో పదార్థం గొంతులోకి పోయింది. కడుపులోకి చేరింది. రుచి లెక్కలేదు. రంగు పట్టదు. వాసన కొట్టదు. మహాకవి కావ్యం వ్రాసినంత దీక్షగా తిన్నాడు. శివుడు విషాన్ని అమృతంలాగా ఇలాగే మింగి ఉంటాడు. అందుకే జనం అతన్ని పరమేశ్వరుడని అంటారు.

పీట వేసుకోలేదు. కాళ్ళు కడుక్కోలేదు. చేతులు తోముకోలేదు. బాచిపట్టు వేసుకోలేదు. పొట్ట తెచ్చుకున్న పాత్ర వంటి నోట్లోకి బావిగట్టుమీద ఉన్న పాత్రల్లోంచి పరబ్రహ్మ ప్రవేశిస్తుంటే నిలబడ్డ మొండోడి ముఖంలో ఏదో తేజస్సు కనిపించసాగింది.

తూరుపు తెల్లబడుతూ ఉంది. మొండోడు తిని తేన్పకపోతే తెల్లవారేది కాదు అనుకున్నాడు పెద్దోడు.

మొండోడు గిలకల వెంట్రుకల పొత్తులు విప్పాడు. సవరించాడు. నిక్కర్లో వెంట్రుకలు దోపుకున్నాడు. నాలుగు గిలకల్ని తిప్పాడు. అది కుయ్‌మంది. ఇది కయ్‌మంది. ఇంకొకటి సై అంది. మరొకటి జై అంది.

మెల్లగా మాదిగపల్లె ఇళ్ళలో కదలికలు ప్రారంభమయ్యాయి. వెంటనే మొండోడు రాక్షసి బొగ్గు లాటుల్లోకి వచ్చాడు. లాటులు కదిలినట్లయింది. ఏ లాటుల సందుల్లో ఉన్నాడో. పెద్దోడు వెతుకుతూనే ఉన్నాడు. పెద్దోడు చూస్తుండగానే సూర్యుడు ఉదయించాడు. గిలకలు విరామం లేకుండా మోగుతున్నాయి.

మొండోడు మళ్ళీ కనిపించలేదు.

✦